# 13

# ఎన్జీవోలు

## 'బాతాల పోశెట్టి' పేరిట రాసిన కాలమ్స్

"ఏమైందే బేవోసులైనట్టు మంచాల వన్నవ్".

"ఏమోరా రెండుసార్లు కక్కుకున్న, మూడుసార్లు బైలుకు పోయిన, కడుపంత ఎట్లనో అయింది. ఇగ సాత గాకుంటైంది".

"అసలేందిన్నవే ఆరోజు"

"తెల్లారి మిగిలిన పచ్చిపులుసు పారబోసుడెందుకని సలన్నంల కల్పుకోని తిన్న గంతే".

"ఏదీ మొన్న కళాయి జేపిచ్చిన ఇత్తడి భగోన్లనే పోసినవా పుల్సు".

"ఇగ ఉన్నది గదేనాయె".

"అయ్యో! కళాయి దాంట్ల పుల్సు వోత్తే కళాయి వోయి చిలుంబడుతది గాదె. ఎంతపని జేత్తివే".

"ఏమైతది తియ్యి అనుకున్నరా!"

"గదే నీ కొంప ముంచెగదనె ఎన్టీఆర్ కొంప ముంచినట్టు".

"మల్ల గా ముచ్చటే మొదలెట్టినావురా అయితే ఏమయిందిరా".

"ఏముందే పాత ఇత్తడి భగోనికి కళాయి గొట్టిచ్చినట్టు పాత పార్టీలోల్లందర్నీ కళాయిగొట్టి తెలుగుదేశం పేరుమీద ఇస్టీలు దాని తీర్గ మెరిసేటట్టు జేసిండు, ఎన్జీవోల పుల్సు అండ్ల పోసేటాల్లకు అది కొరికికొరికి పాత ఇత్తడి భగోని తేలింది. ఆ పుల్సు తాగుతేమైతది అనుకున్నడు నీ తీర్గ. కని తాగినంత జూడూ బైలువెదు తున్నది ప్రభుత్వానికి, ఇగ సాతగాకుంటైంది కడుపుల పేల్కలు తెగిపోయినట్టు గజిటెడ్ ఆఫీసర్లు, తహసీలుదార్లు గిట్ల అందరూ సమ్మెల జేరవట్టిరి.

"అయితే ఇండ్ల నువ్వు జెప్పచ్చేదేందిరా? ఎన్టీరాంరావు గౌర్మెంటు పాత ఇత్తడి భగోనేనంటవ?"

"లేకపోతే తెల్గుదేశం పార్టీ పుట్టంగనే అందరు ఏకుదమ్మున మూడు గంటల సినిమ్మల పుట్టిపెరిగినట్టు పెరిగి అచ్చిర్రనుకున్నవ? అదీ గాక అది పాత భగోనో కొత్త భగోనో సూత్తె తెలుత్తలేదాయ"

"ఎట్లర?"

"బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్‌రాజ్యంల నాల్రోజులు తక్కో రెన్నెల్లు సమ్మె జెయ్యలేదాయె. వెంగల్రావు జమాన్ల ఎవలనువడితె వాల్లను నక్సలైట్లని సంపలేద? పోలీసులు సంపిన నక్సలైట్ల గురించి అసలేం జరిగిందని భార్గవ కమీషనేత్తె దాన్ని వేరె రూలు తోటి చెన్నారెడ్డి బందు జేపియ్యలేదాయె! గివన్ని ఎన్టీరాంరావు గూడ జేసిండు. ఇగ అది పాత భగోనా కొత్త భగోనా నువ్వే జెప్పు"

"అయితే సమ్మె బాగ రోజులే నడుత్తదంటవు".

"నడ్వక పోవచ్చు".

"ఎట్ల జెప్తవురా",

"ఎన్టీ రాంరావు ఇందిరాగాంధి తీర్గ ప్రధానమంత్రి కావాలనుకోవట్టె ఈ సమ్మె జెయ్యవట్టి జార్జి ఫెర్నాండెజ్ కాన్నుంచి అందరు తిట్టవట్టిరి. అన్ని కార్మిక సంఘాలోల్లు, దేశం మొత్తం ఉద్యోగులు సమ్మెకు మద్దతు ఇయ్యవట్టిరి. అందరు మద్దతు ఇయ్యవట్టిరి. గందుకు జెల్దే దిగి వత్తుడు కొడుకు".

"గీల్ల లొల్లికి గాల్లందరికి మద్దతెందుకురా అసలు".

"పని జేసేటోల్లందరం ఒకటే అని జెప్పటానికే".

"మరి ఈల్లెన్నడన్న ఎవలకన్న మద్దతిచ్చినార్ర".

"ఎవలే?"

"ఈ సర్కారు నౌకరోళ్ళు".

"ఎవల కిమ్మంటవే".

"గా నడుమ బొగ్గు బాయిలోల్లు రెన్నెల్లు సమ్మె జేసిరి. ఒక రోజు పని కోకపోతే వారంరోజుల జీతం గోత్తనంటె! గాద బొంబైల యాడాదినర్థం నుంచి సాంచాలల్ల పని జేసేటోల్లు సమ్మెజేత్తె పనిమీదికెల్లి ఊడగొట్టిరి. నిన్నగాక మొన్న

రైతుకూలీల సభకచ్చేటోల్లందర్నీ జేల్లేసిరి. మరి గీల్లందరి గురించి ఈల్లు ఎన్నడన్న ఏమన్న మద్దతిచ్చినా(ర?"

"నువ్వన్నది నిజమేనే! ఎవలు మనోల్లు ఎవరు పరాయోల్లు అని ఎన్జీవోలు గిపుడుగిపుడే తెలుసుకుంటు(న్రు. ఇగ ముంగట గిట్ల ఒగల కొగలు మద్దతిచ్చుకోవాల్నని అనుకుంటరు గావచ్చు. రోజు రోజుకూ పరిస్థితులు మారవట్టె మనందరం వేర్వేరుంటే అందర్నీ నువ్వొక్కనివి, ప్రజలు కోట్లు అని అందర్నీ గట్నె అనవట్టె. మేమంటే ప్రజలే అని నిరూపించాల్నంటే అందరొకటి గావాలె".

**'చాటింపు' పక్ష పత్రిక 1983**